కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిభిరం కొనసాగుతోంది. స్థానిక గ్రంథాలయం అధికారి సి. హెచ్.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో చదరంగం పోటీలు, యోగాసనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నెమళాం హైస్కూల్ క్రాఫ్ట్ టీచర్ కే.విస్సు విద్యార్థుల మెదడుకు పదును పెట్టే విధంగా చదరంగం పోటీలు నిర్వహించారు. యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.

మహానాడుకు తరలివెళ్లిన కార్యకర్తలు

విశాలాంధ్ర - జామి: టీడీపీ మహానాడు కార్యక్రమం కడప జిల్లాలో జరుగుతున్న నేపథ్యంలో జామి నుంచి సోమవారం ప్రత్యేక బస్సుల్లో నేతలు, కార్యకర్తలు తరలివెళ్ళారు. స్థానిక జామిలోని శ్రీ వేంకటేశ్వర కళ్యాణ మండపం నుంచి బయలుదేరిన బస్సును టీడీపీ నేతలు కొటాన విజయ్‌కుమార్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి వర్రిరమణ, పార్టీ అధ్యక్షుడు పోలిపర్తి స్వామినాయుడులు జెండాఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేతలు దనియాల పైడిరాజు, ఎన్నింటి అప్పలరాజు బండారు జగన్నాధం, కొత్తలి సూర్యారావు, కొమ్మినేనిశ్రీను, రాయవరపు శ్రీను, లోకవరపు అప్పారావు. రాయవరపుశంకర్, గొర్లె అప్పలనాయుడు, కొత్తలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

27న ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన

విశాలాంధ్ర - విజయనగరం కంటోన్మెంట్: జిల్లాలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వ్యాపారస్తులకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌పై ఈనెల 27వ తేదీ మంగళవారం ఉదయం 10.30 గంటలకు విజయనగరంలోని ఉల్లి వీధిలో ఉన్న చాంబర్ ఆఫ్ కామర్స్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జీఎం శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. పరిశ్రమల శాఖ అధికారులు లీడ్ బ్యాంకు మేనేజర్ తదితరులంతా పాల్గొని వ్యాపారస్తులకు రిజిస్ట్రేషన్‌పై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.

వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ పర్యటన

విశాలాంధ్ర - బొబ్బిలి: పట్టణ ప్రజలు పర్యావరణ పరిరక్షణ కోసం పరిసరాలు పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి పిలుపునిచ్చారు. మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీలతో కంచరవీధి, సంఘ వీధి సచివాలయ పరిధిలో గల రత్నాల నగర్ ఏరియా, ఆకుల రెల్లి వీధి రోడ్డులో పర్యటించారు. సచివాలయ పరిధిలో జరుగుతున్న కాలువలలో సిల్టు తొలగించాలని, డ్రెయిన్ ఔట్ లెట్లను క్లియర్ చేయించి నీరు పారే విధంగా చేయించాలని ఆదేశించారు.

యోగాసనాలకు విశేష స్పందన

విశాలాంధ్ర - బొబ్బిలి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన యోగాసనాలు కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. యోగా గురువు ఎం.ఈశ్వర వర ప్రసాద్ శిష్య బృందంతో పలు యోగాసనాలు చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆయుష్ విభాగం కోమటిపల్లి డాక్టరు సిహెచ్.కనకలక్ష్మి, ఎస్.సుహారిక, శివడవలస హోమియోపతి డాక్టర్‌లు, అల్లోపతి డాక్టర్లు పాల్గొన్నారు. అలాగే ఎంపీడీవో రవికుమార్, తహశీల్దార్ ఎం.శ్రీను, డిప్యూటీ ఎంపీడీవో భాస్కరరావు, అప్పారావు హాజరయ్యారు. యోగాసనం అనంతరం భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

లక్ష్మింపేట కేసు విచారణ నిష్పక్షపాతంగా చేపట్టాలి

- పక్షపాతం చూపిస్తున్న ప్రత్యేక కోర్టు న్యాయమూర్తిని బదిలీ చేయాలి
- లక్ష్మింపేట బాధితులకు అండగా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించిన ఉత్తరాంధ్ర దళిత సంఘాల జేఏసీ నేతలు

విశాలాంధ్ర - విజయనగరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే సంచలనం రేకెత్తించిన లక్ష్మింపేట దళితుల ఊచకోత కేసును నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని ఉత్తరాంధ్ర దళిత సంఘాల నేతలు డిమాండ్ చేశారు. కేసు విచారణ సందర్భంగా పక్షపాత వైఖరి చూపిస్తున్న లక్ష్మింపేట ప్రత్యేక కోర్టు న్యాయమూర్తిని బదిలీ చేయాలని వారు కోరారు. సాక్ష్యులు కోరుకున్నట్లుగా సీనియర్ న్యాయవాది నవాబ్ హుస్సేన్ అక్బర్‌ను ఎస్.పి.పిగా నియమించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు విజయనగరం కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ఉత్తరాంధ్ర దళిత సంఘాల జె.ఏ.సి ఆధ్వర్యంలో దళితులు ధర్నా నిర్వహించారు. లక్ష్మింపేట మారణకాండకు కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని, 13 యేళ్ళుగా నిరీక్షిస్తున్న లక్ష్మింపేట దళిత బాధితులకి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. నెత్తురు తడిచిన నేలన న్యాయం చేయాలని కోరారు. కోర్టు హాలులోనే బహిరంగంగా సాక్షులు, ముద్దాయిల ముందే పక్షపాత పూరితంగా లక్ష్మింపేట ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి వ్యాఖ్యలు చేస్తుండడాన్ని వారు తప్పుపట్టారు. ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సాక్షుల పట్ల పక్షపాతం చూపిస్తున్నందున ఆయనను తక్షణం బదిలీ చేసి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ద్వారా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నిజాయితీ కలిగిన, నిష్పక్షపాతంగా విచారించే న్యాయమూర్తిని నియమించాలని కోరారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర దళిత సంఘాల జెఏసి నేతలు మాట్లాడుతూ లక్ష్మింపేట ఊచకోత ఘటనలో ఐదుగురు ఎస్సీ కులాలనికి చెందిన మాలలు మృత్యువాతవడగా, 23 మంది కాళ్ళు చేతులు విరగొట్టి క్షతగాత్రులను చేసిన కేసులో విచారణ నత్తనడకన సాగుతుందని ఆరోపించారు. 13 యేళ్ళుగా కోర్టుల చుట్టూ బాధితులు తిరుగుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే పలువురు సాక్షులు మృతి చెందారని మరికొందరు కోర్టుల చుట్టూ తిరగలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రత్యేక కోర్టు స్పెషల్ పి.పిని నియమించాలని, రెగ్యులర్ జడ్జిని నియమించాలని కూడా లక్ష్మింపేట బాధితులు కోర్టును ఆశ్రయించారన్నారు. అనంతరం ఉత్తరాంధ్ర దళిత సంఘాల జెఏసి నేతలు విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేసారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల జేఏసీ నేతలు డా. కంత వేణు, తైక్వాండో శ్రీను, పాటల తూటా ఉదయ్ భాస్కర్, నుకతుట బాబు రావు, చిత్ర గంగులు, జజ్జన గురుమూర్తి, కెల్ల బీమా రావు, ముంజేటీ కృష్ణ, సాకేటి నాగరాజు, రామప్పుడు, గురువుపల్లి రవి, ఆదాడ మోహన్ రావు, పి.వి రమణ, బొంగ భాను మూర్తి, బొత్స బుద్ధుడు, బొత్స రాజేష్, పెయ్యల చంటి, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

మారిక రోడ్డు నిర్మాణంలో తేటతెల్లమైన నాణ్యత

అసలు లోపం ఎవరిది - అధికారులదా, కాంట్రాక్టర్‌దా..?

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని కరకవలస పంచాయతీ శివారు గిరిశిఖర గ్రామమైన మారికకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జిల్లా కలెక్టర్ నిధులు రూ.7 కోట్ల నిధులతో చేపట్టిన రోడ్డు నిర్మాణం పనులు నాసిరకంతో చేపట్టడంతో నాణ్యత తేటతెల్లమైంది. వేసిన రోడ్డు కూడా గిరి శిఖరంపై నుండి కిందకు దిగి వచ్చేసింది. ప్రస్తుతం కురుస్తున్న అడపా దడపా వర్షాలతో పాటు ఆదివారం కురిసిన భారీ వర్షానికి కొండపై నుండి వచ్చిన వర్షపు నీటికి తారు రోడ్డు, అలాగే సరియైన కల్వర్టులు లేక రోడ్డంతా యధాస్థితికి వచ్చేసింది. అలాగే వర్షం వస్తే చాలు కొట్టుకుపోయే నాసిరకం రోడ్డు నిర్మాణ పరిస్థితికి కారకులెవరు అధికారులా...

కాంట్రాక్టర్లలా... అంటూ సిపిఎం నేత చల్లా జగన్ ప్రశ్నిస్తున్నారు. ఎన్నో ఏళ్ల తరబడి రోడ్డు లేక నానా అవస్థలు పడి గిరి శిఖరంపై జీవనోపాధి సాగించిన తమకు పోరాటాల ఫలితంగా రోడ్డు నిర్మాణం చేపడితే రోడ్డు పనులు పూర్తి కాకముందే రోడ్డు మొత్తం కురిసిన వర్షానికి కొట్టుకుపోవడంతో ఇక ఈ రోడ్డు దుస్థితి ఇంతేనని గిరిజనలు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ కాంట్రాక్టర్ నాణ్యతతో కూడిన పనులు చేస్తున్నారా లేదా అన్నది సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఈ దుస్థితి నెలకొందని గ్రామ సర్పంచ్ పాతబోయిన పెంటమ్మ, గిరిజనులు జాలరి వీర్రాజు, గెమ్మెల అప్పలనాయుడు, గమ్మెల శ్రీను, కిల్లో అర్జున్, సిందేరి అను, గెమ్మల బుజ్జిబాబు, పాతబోయిన దేముడు, పాలి దేముడు, శోభన్ బాబు, రమేష్ దేముడు, బింగు తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెంకటరమణపేటలో హత్య కేసును ఛేదించిన పోలీసులు

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: వెంకటరమణపేటలో మృతురాలి తనయుడు హరీష్ అనే వ్యక్తి తన తల్లి వెంకట లక్ష్మి కిడ్నాప్ అయినట్లు ఫిర్యాదు చేసిన సందర్భంగా పోలీసులు ప్రారంభించిన విచారణలో, నేరస్థలంలో దొరికిన రక్తపు మరకలు కీలక ఆధారాలుగా నిలిచాయి. విచారణలో పాల్గొన్న కుమార్తె ఒప్పుకున్న విషయం ప్రకారం ఆమె స్నేహితులతో కలిసి పన్నిన పథకం ప్రకారం తన తల్లిని చంపి, శవాన్ని నూతిలో రాళ్లతో కట్టి పడవేసి కొబ్బరి మట్లలతో మరుగు పరిచారు. శవాన్ని పోస్టుమార్టం కోసం తీసుకున్నారు. కుమార్తెను జువెనైల్ హోంకు పంపగా, ఇద్దరు ముఖ్య అనుమానితులను శ్రీకాకుళం-ఒరిస్సా సరిహద్దు ప్రాంతం వద్ద అరెస్టు చేసి, తర్వాత హత్య జరిగిన స్థలానికి దగ్గరలో హత్యలో ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. మూడు టీమ్లతో ఇన్వెస్టిగేషన్ కొనసాగినట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ కేసులో నిందితులను ఛేదించిన ఎస్.కోట పోలీసు వారికి డిఎస్పీ శ్రీనివాసరావు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేసులో శ్రమించిన సీఐ వివిన్ మూర్తికి జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ రివార్డ్ ప్రకటించారు.

రైతుల సొంత నిధులతో చిట్టిగడ్డ కొత్త షట్టర్ నిర్మాణం

విశాలాంధ్ర - రేగిడి: ప్రభుత్వాలు మారినా, అధికారులకు ఎన్ని వినతి పత్రాలు ఇచ్చినా సాయన్న చిట్టి గడ్డ కాలువ మరమ్మతులు చేపట్టడం లేదని ఆయకట్టు రైతులు ఆవేదన చెందుతున్నారు. సోమవారం సంకిలి సమీప చిత్తగడ్డ కాలువపై రైతులు సొంత నిధులతో కొత్త షట్టర్ నిర్మాణం చేపట్టారు. పుర్లి గ్రామ పెద్ద కామిరి ఎక్స్ ఎంపీటీసీ పాలవలస సూర్యరావు, ఖండియం నీటి సంఘం పుర్లి ప్రాదేశిక సభ్యులు పాలవలస ప్రసాదరావు చొరవతో షట్టర్ నిర్మాణం చేపట్టారు. కార్యక్రమంలో రైతులు రావాడ రవి, ఏనత్తుల దుర్గారావు, పాడి రమేషు, జద్దు శంకర్రావు, బుడుమూరు రాము, గాడి రాము పాల్గొన్నారు.

బాధితుల సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించాలి

జిల్లా అదనపు ఎస్పీ పి.సౌమ్యలత

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ ఆదేశాలతో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత సోమవారం నిర్వహించారు. ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను పి.సౌమ్యలత ఆదేశించారు. 32 ఫిర్యాదులను స్వీకరించారు. భూ తగాదాలకు సంబంధించినవి 10, కుటుంబ కలహాలకు సంబంధించినవి 3, మోసాలకు పాల్పడినట్లు 4, ఇతర అంశాలకు సంబంధించినవి 15 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, విచారణ చేపట్టి, 7దినాల్లో ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్య క్రమంలో ఎస్బీ సీఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి. ఆర్.కే. చౌదరి, డిసిఆర్బి సిఐ బి.సుధాకర్, ఎస్ఐ రాజేష్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ ఐటిఐలో ఉద్యోగ మేళా

విశాలాంధ్ర-విజయనగరం : జిల్లా కేంద్రమన విజయనగరంలోని ప్రభుత్వ ఐటిఐలో మంగళవారం క్యాంపస్‌ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్ టి.వి. గిరి తెలిపారు. ఉదయం 9గంటలనుంచి ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు. మొత్తం 9 కంపెనీలు ఈఉద్యోగ మేళాలో హాజరవుతున్నాయని, ఐటిఐ పాసైన విద్యార్థులు, ఈఏడాది ఆగస్టులో పరీక్షకు హాజరుకాబోయే విద్యార్థులు ఈఎంపికలలో పాల్గొనవచ్చని సూచించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ బయోడేటాతోపాటు ఒరిజినల్ సర్టిఫికేట్స్, ఆధార్ కార్డు జెరాక్స్, రెండు ఫొటోలను తీసుకురావాలన్నారు. వివరాలకు 9849118075, 9849944654 సప్రదించాలన్నారు.

ఫ్లై ఓవర్‌పై రోడ్డు ప్రమాదం ఒకరు మృతి ..మరొకరికి గాయాలు...

విశాలాంధ్ర - గంట్యాడ: గంట్యాడ మండలం రామవరం గ్రామం ఫ్లై ఓవర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనంపై రోలవాక నుంచి సారిక గ్రామానికి వెళుతున్న క్రమంలో బొండపల్లి జగన్ (19) రోడ్డుపై ఆగి ఉన్న లారీని బలంగా ఢీ కొట్టాడు. దీంతో తలకి బలమైన గాయాలు తగలడం వలన అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో చింతాడ మధు అనే వ్యక్తికి గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని విశాఖ కేజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. ఎస్ఐ సాయి కృష్ణ కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు.

మిర్తి వలసలో 104 సేవలు

విశాలాంధ్ర - రామభద్రపురం: మండలంలోని మిర్తివలస గ్రామంలో సోమవారం 104 వాహనం ద్వారా రోగులకు పంచాయతీ కార్యాలయంలో సేవలు అందించారు. ముఖ్యంగా బీపీ, షుగర్, జ్వరము లాంటి రోగాలకు మందులు పంపిణీ చేశారు. 104 వాహనం ద్వారా గ్రామం లోకి వచ్చి 74 రకాల రోగాలకు మందులు ఇవ్వడం జరుగుతుందని ఏఎన్ఎం బుజ్జి, డేటా ఎంట్రీ ఆపరేటర్ శ్రీహరి తెలిపారు. 80 మంది వరకు రోగులు పాల్గొని మందులు తీసుకుని వెళ్లారు.

జేవీవీ అధ్యక్ష, కార్యదర్శులుగా ఆనంద్, కృష్ణారావు

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: ఈనెల 25న జరిగిన జనవిజ్ఞాన వేదిక 18వ జిల్లా మహాసభలు సందర్భంగా 2025 - 2027కు సంబంధించి 24 మంది సభ్యులతో నూతన కార్యవర్గాన్ని జెవివి కోర్ కమిటీ ప్రకటించింది. జెవివి జిల్లా అధ్యక్షుడిగా ఉన్న ఎరుకొండ ఆనంద్‌ను రెండవసారి అధ్యక్షుడిగా కొనసాగించేందుకు కోర్ కమిటీ నిర్ణయించింది. జిల్లా ప్రధాన కార్యదర్శిగా చీపురుపల్లికి చెందిన బయాలజీ ఉపాధ్యాయుడు డాక్టర్ మిరియాల కృష్ణారావు, జిల్లా కోశాధికారిగా జెవివి నగర అధ్యక్షుడు షిణగం శివాజీని నియమించినట్లు కోర్ కమిటీ ప్రకటించింది. వీరితోపాటు ఉపాధ్యక్షులుగా పంపాన రామారావు, మమ్ముల తిరుపతిరావు, సహాయ కార్యదర్శిగా యు.శాంతి కుమారుని నియమించారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర - డెంకాడ: నెల్లిమర్ల నియోజకవర్గం డెంకాడ మండలం బంటుపల్లి గ్రామంలో శ్రీ సీతారాముల విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో నెల్లిమర్ల నియోజకవర్గం టీడీపీ సీనియర్ నాయకులు కంది చంద్రశేఖరరావు పాల్గొని ఆలయ కమిటీ సభ్యులకు 25,000 విరాళం అందజేసారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి సంఘం సురేష్, సర్పంచ్ చిక్కాల జనార్థన్, యాదవ సాధికార సమితి కన్వీనర్ కొర్నాన అదిబాబు, డెంకాడ మండలం తెలుగు యువత అధ్యక్షులు బొండా రవి కిరణ్, గ్రామ పార్టీ అధ్యక్షులు భాస్కర్‌రావు పాల్గొన్నారు.

పట్టణంలో భారీ వర్షం

లోతట్టు ప్రాంతాలు జలమయం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఎండలు మండించే రోహిణి కార్తెల సమయంలో వర్షాలు కురుస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా గత కొద్ది రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. రోహిణి కార్తల సమయంలో రాళ్లు సైతం పగులుతాయని అన్న సామెత ఇప్పటికే అందరి నోళ్ళల్లో ఉంది. అలాంటి ఈ రోజుల్లో ఒక్కసారిగా వర్షాలు కురుస్తున్నాయి బంగాళాఖాతం, అరేబియా సముద్రాలలో ఏర్పడుతున్న వరుస అల్పపీడన ప్రభావాల వల్ల ఈ వర్షాలు కురుస్తున్నాయన్న అంచనా. దీనికి తోడు రావలసిన నైరుతి ముందుగానే రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా పాటు జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాలలో గత కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. అయితే సోమవారం ఉదయం నుండే ఆకాశమంతా మేఘమృతమై మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఒక్కసారిగా ప్రారంభమైన భారీ వర్షం సుమారు గంట పాటు ఎడతెరిపి లేకుండా పడడంతో పట్టణంలో లోతట్టు ప్రాంతాలు అన్నీ కూడా పూర్తిగా జలమలయమయ్యాయి. ముఖ్యంగా రాజీవ్ నగర్ కాలనీ, పద్మావతి నగర్, నటరాజ్ కాలనీ, గుడ్ షెడ్, టాక్సీ స్టాండ్, ఘంట స్తంభం, ఇలా పట్టణంలో అనేక ప్రాంతాలలో వర్షపు నీరు రోడ్డుపైకి వచ్చేసింది. దీంతో ప్రయాణికులంతా అనేక ఇబ్బందులు పడ్డారు. ఎక్కడ ఏ గుంతలో నీరు ఉందోనని భయపడి ప్రయాణం సాగించారు. రోడ్లపై వ్యాపారాలు చేసుకునేవారు ఒకసారిగా భారీ వర్షం కురవడంతో ఏం చేయాలో తెలియక అక్కడే ఉండిపోయారు.

ఖరీఫ్‌కు శుభారంభం

వ్యవసాయ శాఖ జెడి విటి రామారావు

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఖరీఫ్‌కు శుభారంభమని వ్యవసాయ శాఖ జెడి విటి రామారావు అన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల చెరువులు నిండి వేగంగా నాట్లు వేసుకోవడం వల్ల రైతులకు సకాలం కన్నా ముందే పంట చేతికొచ్చే అవకాశం ఉందన్నారు. దీనివల్ల రైతులకు లాభాలు వచ్చే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా నవధాన్యాలు కూడా ప్రస్తుతం వేసుకోవడానికి మంచి సమయం అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉండే రైతులంతా వర్షాలను ఉపయో గించుకునేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

కొత్త సారొచ్చారు... కరెంట్ కట్ చేసేశారు.!

- వికలాంగుడు బతిమాలినా కనికరించని వైనం
- అంత తప్పు ఏమి చేశాడో మరి ?

Eastern Power Distribution Company of AP Limited

విశాలాంధ్ర - పూసపాటిరేగ: అతనొక వికలాంగుడు.. పూసపాటి రేగ రాజా వీధిలో అద్దె షాపులో జెర్సాక్స్ నడుపుకుంటూ జీవనం సాగిస్తునాడు. సోమవారం ఉదయం ఎప్పటి లాగే వచ్చి షాప్ తెరిచి పని చేసుకుంటున్నాడు. సచివాలయం నుండి విద్యుత్ లైన్‌మెన్ వచ్చి మీ మీటర్ మీద కేసు ఉంది 3000 రుసుం కట్టాలి అన్నారు. నేను ప్రతి నెల కరెంట్ బిల్లు సక్రమంగా కడుతున్నాను ఇది ఏమిటి అని ప్రశ్నించాడు వికలాంగుడు. ఏమో నాకు తెలియదు భోగాపురం ఏ.డి.ఈ కొత్తగా వచ్చారు. మీ కనెక్షన్ తీసేమన్నారు అంటూ విద్యుత్ వైర్ కట్ చేసి వెళ్లిపోయాడు. ఇదంతా అర్థం కాని వికలాంగుడు ఒక రోజు టైమ్ ఇవ్వండి ఎందుకు కట్టాలో ఏమిటో ఆఫీస్‌కి వెళ్ళి తెలుసుకొని కడతాను, సోమవారం ఎక్కువ వ్యాపారం పోతుందని బతిమిలాడినా సరే ఆ అధికారి వినలేదు. చేసేది లేక షాప్ యజమానికి విషయం చెప్పగా 2012లో లోడు పెరిగినందుకు 3100 కట్టిన బిల్లులు ఉన్నాయని పట్టుకొని స్థానిక ఏఈని సంప్రదించగా కట్టవలసింది బిల్లు కాదు 06/10/2018 తేదీన ఆ షాప్‌లో విద్యుత్ లోడు తనిఖీ చేసి మీరు లోడు పెంచుకోండి అని చెప్పి వెళ్ళిపోయారు..అప్పటికి ఆ షాపులో ఇతని జెరాక్స్ షాప్ లేదు. వేరే పని వారు ఉండేవారు. అది ఇప్పుడు కట్టాలి అన్నారు. ఎటువంటి ముందస్తు నోటీస్ లేకుండా కరెంట్ కట్ చేస్తే అది ఎంతవరకు న్యాయం? అధికారులకు ఆమాత్రం ఇంగిత జ్ఞానం ఉండదా ?ఈ ఏడు సంవత్సరాలు ఏమి చేసినట్టు....ఇప్పుడు గుర్తొచ్చిందా? అకస్మాత్తుగా వచ్చి ఫ్యూజ్ పీకేస్తే అతని పరువు పోదా?..చేయని తప్పునకు ఆ వికలాంగుడు శిక్షా అనుభవించాలా...? ఏదైనా చర్య తీసుకోవాలి అంటే ముందస్తు నోటీస్ ఇవ్వాలి కదా అంటూ స్థానికులు డిపార్ట్మెంట్‌ను ఆక్షేపిస్తున్నారు. ఇదే విధంగా మరో 15 సర్వీసులు తొలిగించినట్టు స్థానిక ఏఈ తెలిపారు. ఇప్పటికైన పై అధికారులు సరైన విధంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు.

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దటమే లక్ష్యం

విశాలాంధ్ర - కొత్తవలస: నాటుసారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కొత్తవలస స్టేషన్ హౌస్ ఆఫీసర్ జి.ఎస్. రాజశేఖర్ నాయుడు అన్నారు. కొత్తవలస మండలంలో గల రామలింగాపురం, మునిరాం, అప్పన్నదరపాలెం, చిన్నమన్నపాలెం, వేపాడ మండలంలోని కొంపల్లి, కె.ఆర్.పేట గ్రామాలలో సంపూర్ణ నాటు సారా రహిత గ్రామాలుగా అడుగులు వేసే క్రమంలో ఆయా గ్రామాలలో సోమవారం గ్రామ కమిటీల సమక్షంలో సారా రహిత గ్రామాలుగా ప్రకటించినట్లు ఆయన పేర్కొన్నారు. నిరంతరం ఆయా గ్రామాలను పర్యవేక్షిస్తూ నాటు సారాయి వలన కలిగే దుష్ప్రభావాలను తెలుపుతూ దానికి బానిసైన వారి వివరాలను సేకరించి నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా వారిని పునరావాస కేంద్రాలకు తరలించి వారిని ఈ మహమ్మారి నుండి దూరం చేయడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్లు వి.ఎన్.రాజు, ఎన్.రమ్యశ్రీ, గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

మహానాడుకు బయలుదేరిన వేపాడ టీడీపీ శ్రేణులు

విశాలాంధ్ర - వేపాడ: టీడీపీ పార్టీ కడపలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మహానాడు కార్యక్రమానికి వేపాడ మండల పార్టీ అధ్యక్షుడు గొంప వెంకట్రావు సారధ్యంలో వేపాడ మండల టిడిపి శ్రేణులు బయల్దేరారు. మండల కేంద్రమైన వేపాడలో ఆదివారం మండల పార్టీ అధ్యక్షుడు గోంప వెంకటరావు పార్టీ జెండా ఊపి బస్సును బయల్దేరించారు. అలాగే బస్సు ఎక్కిన టిడిపికి శ్రేణులు జై తెలుగుదేశం జై చంద్రబాబు నాయుడు అంటూ నినాదాలు చేశారు.

ప్రతిరోజు యోగా... ఆరోగ్యానికి బాట

బొబ్బిలి, తెర్లాం మండలాల్లో ర్యాలీలు

జిల్లా కేంద్రంలో యోగా స్ట్రీట్

విశాలాంధ్ర-విజయనగరం/బొబ్బిలి/ తెర్లాం: ప్రతిరోజు యోగా చేయడం ద్వారా ఆరోగ్యానికి రాచబాట వేయవచ్చునని పలువురు యోగా గురువులు పేర్కొన్నారు. యోగా ద్వారా శారీరక ఆరోగ్యమే కాకుండా మానసిక ఆరోగ్యము కూడా సిద్ధిస్తుందని సూచించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రజలను చైతన్యపరిచేందుకు మండలాల్లో ర్యాలీలు ప్రారంభమయ్యాయి. బొబ్బిలి, తెర్లా మండలాల్లో సోమవారం ఉదయం భారీ ఎత్తున ర్యాలీలు నిర్వహించి యోగా పై ప్రజలకు చైతన్యం కల్పించారు. జిల్లా కేంద్రం విజయనగరంలో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో యోగ స్ట్రీట్ నిర్వహించారు.

బొబ్బిలిలో యోగా ప్రదర్శన

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం యోగాసన కార్యక్రమము జరిగింది. యోగా గురువు ఎం.ఈశ్వర వరప్రసాద్ తమ శిష్య బృందంతో యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ విభాగం కోమటిపల్లి డాక్టర్ సిహెచ్. కనకలక్ష్మి, అదేవిధంగా శివడవలస హెూమియోపతి డాక్టర్ ఎస్.సుహారిక, ఇతర డాక్టర్లు హాజరయ్యారు. యోగా ప్రదర్శన అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పలువురు స్థానిక ప్రజా ప్రతినిధులు, ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో, తహసీల్దార్ తదితర మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, వెలుగు, ఉపాధి హామీ సిబ్బంది, పాఠశాలల వ్యాయామ సిబ్బంది, వివిధ రంగాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్వచ్ఛందంగా వివిధ రంగాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

తెర్లాంలో భారీ ర్యాలీ

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా తెర్లాం మండల కేంద్రంలో భారీ ప్రదర్శన నిర్వహించి, యోగాపై అవగాహన కల్పించారు. యోగా గొప్పదనాన్ని వివరిస్తూ నినాదాలు చేశారు. ఎంపిడిఓ కార్యాలయం నుంచి పాత ఆర్టీసీ బస్టాండ్ వరకూ ఈ ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీడిఓ నీలిమ, ఏవో వెంకటరమణ, ఇంచార్జి తాసిల్దార్ జీ.సత్యనారాయణ, ఇతర మండల కార్యాలయాల అధికారులు, సిబ్బంది, ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు, ఇతర వైద్యులు, ఆ శాఖ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు, ఉపాధి హామీ, సచివాలయాల సిబ్బంది, వీఆర్వోలు, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో యోగా స్ట్రీట్

భారతీయ సంస్కృతిలో సాంప్రదాయంగా వస్తున్న వ్యవస్థల్లో యోగా ఒకటని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం నగరంలోని పైడితల్లి అమ్మవారి ఆలయ ప్రాంతంలో యోగా స్ట్రీట్ ఏర్పాటు చేసి, యోగాసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కోట వరకు ర్యాలీ చేపట్టారు. ప్రజలు, నగరపాలక సంస్థ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు, స్వయం సహాయక సంఘాల మహిళలు అధికంగా పాల్గొని యోగ ఔన్నత్యాన్ని చాటారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్రా కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని యోగా ఆవశ్యకతపై చైతన్యం కావాలన్నారు. నెల రోజులపాటు యోగా కార్యక్రమాలను వివిధ రకాలుగా జిల్లా యంత్రాంగం నిర్వహిస్తుందన్నారు. ఒక్కొక్క ప్రధాన ప్రాంతంలో రెండు రోజులు పాటు యోగ కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను భాగస్వామ్యం చేయనున్నామని తెలిపారు. యోగ వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ సమాజంలో ప్రతి ఒక్కరు యోగా అభ్యసించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. సులభతర రీతిలో, సునాయా సంగా యోగా చేయవచ్చని చెప్పారు. యోగాతో ఆరోగ్య పరిపుష్టి చెందుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ డిఎ పిడి కళ్యాణ చక్రవర్తి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జీవన్ రాణి, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ ఆనందరావు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి వెంకటేశ్వ రావు, సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, ఈఈ టి.రాయల్ బాబు, టిపిఆర్ఓ సింహాచలం, డిఈలు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

విశాలాంధ్ర - తెర్లాం: తెర్లం మండలం గొలుగువలస గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులను ఏపీఓ సుశీల పరిశీలించారు. అక్కడ వేతనదారులతో మాట్లాడి రెండు పూటల పని చేసి కనీస వేతనం వచ్చేలా పని చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ మనోహర్ నాయుడు పాల్గొన్నారు.

ఆపరేషన్ సింధూర్ విజయంపై హర్షం

విశాలాంధ్ర - బొబ్బిలి: ఇటీవలి జరిగిన పెహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ భారత ప్రభుత్వం తీసుకున్న ఆపరేషన్ సింధూర్‌కు మద్దతుగా సోమవారం కోర్టు ప్రాగణంలో బార్ అధ్యక్షులు మత్స ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ప్రదర్శించి

హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఉగ్రవాదం పూర్తి స్థాయిలో నిర్మూలన కావాలని, దేశ భక్తి భారత పౌరుల్లో నిండుగా ఉండి దేశ శాంతి సమైఖ్యతో ఉండాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షులు మత్స ఆనంద్ కుమార్, జనరల్ సెక్రటరీ, ఉపాధ్యక్షులు రుంకాణ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మండలంలో యోగాపై ర్యాలీ

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలో సోమవారం యోగ కార్యక్రమ ర్యాలీ, యోగ డిమానిస్ట్రేషన్ నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమానికి మండలంలో గల మండలస్థాయి అధికారులు, సంబంధిత కార్యాలయ సిబ్బంది, అన్ని సచివాలయాల సిబ్బంది, ఉపాధి హామి శ్రామికులు, వెలుగు విఓలు హాజరయ్యారు.

కడప "మహానాడు"కు బయలుదేరిన అంగటి రాము

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: రాష్ట్ర బీసీ ఆర్గనైజేషన్ సెక్రటరీ అంగటి రాము ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కడపలో జరగబోవు తెలుగుదేశం పార్టీ "మహానాడు" మహా సభా కార్యక్రమంనకు చేరుకొనుటుకు సోమవారం ఉదయం 11:00 గంటలకు బయలుదేరారు. ప్రతీ సంవత్సరం స్వర్గీయ నందమూరి తారకరామారావు జన్మదినమును పురస్కరించుకొని మూడు రోజులు అతి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడు పండుగ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో తరలి వెళ్తున్నారు. ఈ కార్యక్రమంలో అంగటి మూర్తి, పట్నాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వినతుల పరిష్కారంలో దాటిన గడువు

అధికారులకు షోకాజ్ నోటీసులు

కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చిన వినతులను 24 గంటల్లో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ అధికారులకు ఆదేశించారు. సోమవారం వినతులు స్వీకరించిన కలెక్టర్ అంతకు ముందు అధికారులతో సమీక్షించారు. ఆన్లైన్‌లో ఇంకనూ చూడవలసిన వినతులు 8 ఉన్నాయని, గడువు దాటినవినతులు 2 ఉన్నాయని, వినతుల పరిష్కారం లో గడువు దాటినందుకు సంబంధిత అధికారులకు షో కాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం లోగా వారి వివరణలు ఇవ్వాలని తెలిపారు. రీ ఓపెన్ కేసులు లేకుండా చూడాలని, జిల్లా ఆడిట్ టీం కూడా పెండింగ్ లేకుండా ఎప్పటి వినతులు అప్పుడే ఆడిట్ చేయాలని సూచించారు.

పిజిఆర్ఎస్‌కు 160 వినతులు

సోమవారం పిజిఆర్ఎస్‌కు 160 వినతులు అందాయి. జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, ఇన్‌చార్జ్ డి.ఆర్.ఓ మురళి, డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వరరావు, నూక రాజు, ప్రమీల గాంధీ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 160 అర్జీలు అందగా, భూ సమస్యలకు సంబంధించి రెవిన్యూ శాఖకు అత్యధికంగా 82 వినతులు అందాయి. పంచాయతిశాఖకు 10, పింఛన్లు మంజూరు చేయాలని తదితర అంశాలపై డిఆర్డిఏకు 21 వినతులు అందాయి. మున్సిపాలిటీకి 10, జిఎస్‌డబ్ల్యుకు 1, విద్యా శాఖకు 7, హౌసింగ్‌కు 1 అందగా, వైద్య శాఖకు 02, విద్యుత్ శాఖకు 5 చొప్పున అందాయి. మిగిలినవి ఇతర శాఖలకు చెందినవిఆర్జీలను రాయడానికి కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన సహాయ కేంద్రం ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే నిరక్షరాస్యులకు ఆర్జీలను రాయడానికి కలెక్టరేట్ వద్ద సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసారు. నిరక్షరాష్యులైన వారు తమ ఆర్జీలను రాయడానికి దళారీలను ఆశ్రయిస్తున్నారని, వారు అర్జీదారులను మభ్య పెట్టి వారి నుండి డబ్బును తీసుకొని ప్రతి వారం కలెక్టరేట్ చుట్టూ తిరిగేలా చేస్తున్నారని, ఇక పై కూడా అర్జీదారులు మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని, జెరాక్స్ కేంద్రాల్లో రాయించవద్దని, కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన సహాయ కేంద్రంలో సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, వారి లబ్దిదారులు కూడా యోగంధ్రలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు జిల్లా పర్యాటక అధికారి పర్యవేక్షణ లో నిర్వహించాలని, ఉపాధి హామీ కార్మికుల తో డ్వామ పి.డి. ఆధ్వర్యంలో ప్రతి రోజు ఉదయం 7 గంటల నుండి యోగ చేయించాలని తెలిపారు. బదిలీల ఫైళ్ల ను ఆఖరి తేదీన కాకుండా ముందుగానే పెట్టాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. బదిలీలలో ఎటువంటి సిఫార్సు లను ఆమోదించడం జరగదని, నిబంధన మేరకే చేపడతామని స్పష్టం చేసారు.

విశాఖ ఉక్కు సమస్యను పరిష్కరించాలి

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ డిమాండ్

విశాలాంధ్ర - విజయనగరం రూరల్: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని వాగ్దానం చేసిన టీడీపీ కూటమి ప్రభుత్వం తక్షణమే విశాఖ స్టీల్ ప్లాంట్ సమస్యను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ విజయనగరం జిల్లా నాయకులు టీవీ రమణ, కే.అప్పలసూరి, బి.రాంబాబు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ వద్ద విశాఖ ఉక్కు పరిశ్రమపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 32 మంది బలిదానంతో విశాఖ ఉక్కు పరిశ్రమ ఏర్పడిందని, ఆంధ్ర రాష్ట్రానికి, ఉత్తరాంధ్రకి అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ స్టీల్ ప్లాంట్‌ను కేంద్రం అమ్మేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదన్నారు. స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, సెయిల్‌లో విలీనం చేయాలని, మరింత సమర్థ వంతంగా నడపాలని పోరాడుతుంటే , 4000 మంది కాంట్రాక్ట్ కార్మికులు తొలగించి, నిర్బంధాన్ని ప్రయోగించి, ఉద్యమాన్ని అణచివేయాలని కేంద్రం భావిస్తుందని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించటం ద్వారా విశాఖ ఉక్కు కార్మికులకు, ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం ద్రోహం చేస్తుందని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెడ్డి శంకర్రావు, ఎం.వాసా, వి.లక్ష్మి, బి.సూర్యనారాయణ, ఏ.జగన్మోహన్రావు, రాకోటి ఆనంద్, పెంటరాజు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనకై ప్రత్యేక దృష్టి

ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఎస్ఐ వి.ఎన్ రాజు

విశాలాంధ్ర - వేపాడ: గ్రామాల్లో నాటు సారా నిర్మూలనకై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని కొత్తవలస ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ ఎస్సై వి.ఎన్.రాజు అన్నారు. సోమవారం మండలంలోని కుమ్మపల్లి కృష్ణా రాయుదుపేట,గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆయా గ్రామాల సర్పంచులు నవుడు అరుణ శ్రీనివాస్, చెలిబోని ముసలి నాయుదులు మాట్లాడుతూ నాటు సారాయి సేవించడం వలన ఆరోగ్యాలు క్షీణించి కుటుంబాల రోడ్డు పడతాయని అందువలన నాటు సారా పూర్తిగా నిషేధించడం జరిగిందని, ప్రస్తుతం గ్రామాల్లో నాటు సారా పూర్తిగా నిర్మూలించడం జరిగిందన్నారు. అలాగే భవిష్యత్తులో గ్రామంలో నాటు సారా ఎవరైనా తయారుచేసిన కొనుగోలు చేసిన అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వారిని ఎక్సైజ్ అండ్ ప్రొఫెషన్ శాఖ సిబ్బందికి మేమే అప్పగిస్తామని బహిరంగంగా ప్రకటించారు.అలాంటి వారిపై అధికారులు కేసుల నమోదు చేసిన ఎటువంటి సిఫారసులు ఒత్తుడులు తీసుకురామని అన్నారు.అలాగే నాటు సారా నిర్మూలనకు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సిబ్బంది పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. అలాగే కొత్తవలస ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఎస్.ఐ వి.ఎన్ రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నాటు సారా పూర్తిగా నిర్మూలించడం జరిగిందని నిరంతరం గ్రామాల సర్పంచులు, సచివాలయ సిబ్బంది, స్వయం సహాయక సంఘాలతో నాటు సారా పై ఆరా తీస్తూ చర్యలు తీసుకుంటామని,వారి నుండి ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నామని,అలాగే గీత కార్మికులు ఎవరైనా నాటుసారతో పట్టుబడితే వారిని సంఘం నుండి తొలగించడంతో పాటు గీత కార్మికుల కార్డులను రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.అలాగే నాటు సారా తయారీదారులు సారా తయారు చేయడం మానేస్తే వారికి ప్రభుత్వం జీవనోపాధికి ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తుందన్నారు.ఈ మూడు నెలల్లో అనేకమంది పాత నేరస్తులు కొత్తగా కేసులు నమోదయిన వారిని అలాగే అనుమానితులపై కూడా మండల తహసిల్దారు వద్ద బైండోవర్ చేసి రూ.2 లక్షల అపరాధ బాండ్లను చేయించడం జరిగిందన్నారు.అలాగే సారా తయారీకి అవసరమైన బెల్లం అమ్మిన వారిపై కూడా కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎస్.ఐ రాజు తెలిపారు.అనంతరం సారా రహిత గ్రామాలగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శిలు టి.వెంకటేష్,ఆర్. కమల,ఎస్ శాంతి కుమారి, వీఆర్ఓ జి.శ్రీనివాసరావు, మహిళా పోలీసులు వి. దమయంతి,అనూష,విఓఏలు భారతి,నాగమణి,లీల, ఎక్సైజ్ సిబ్బంది బి.హరికిరణ్, అటవీ శాఖ అధికారి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌సీఎం హైస్కూల్ పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

విశాలాంధ్ర - కొత్తవలస: పాతికేళ్ల తరువాత ఆనాటి విద్యార్థులు ఒక్క చోట చేరారు. ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆ నాటి మధుర స్మృతులను, చిలిపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి గౌరవించుకున్నారు. కొత్తవలస మండలంలోని కొండదాబా వద్ద గల సెయింట్ మేరీస్ ఆర్.సి.ఎమ్ హైస్కూల్లో 1995-2000 వరకూ చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమావేశం పాఠశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పూర్వ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలనందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ తమ వద్ద చదువుకున్న విద్యార్థులు సమాజానికి ఉపయోగపడేలా ఉన్నత స్థాయికి ఎదగడం, కుటుంబంతో సంతోషకరమైన జీవనం సాగించడం ఆనందదాయకంగా ఉందన్నారు. సుదూర ప్రాంతాల నుంచీ మిత్రులు రావటంతో తమ 25ఏళ్ల సుధీర్ఘకాల కలయిక ప్రత్యేకత సంతరించుకుందంటూ పలువురు సంతోషం వ్యక్తం చేశారు. చదువుకున్న రోజుల్లో జ్ఞాపకాలు నెమరేసుకుని ఉబ్బి తబ్బిబయ్యారు.

సమస్యలు పరిష్కరించాలని రఘురాజుకు వినతి

విశాలాంధ్ర - శృంగవరపుకోట: పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్సీ ఐ.రఘురాజుకు జన జాగృతి సంస్థ ఉత్తరాంధ్ర కన్వీనర్ శీరాపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వినతి అందజేశారు. వృద్ధుల్లో కొందరికి 60 సంవత్సరాలు 70 సంవత్సరాలు వయస్సు దాటినప్పటికీ వారికి ఆధార్ కార్డులో 55 లేదా 59 సంవత్సరాలు వయసు ఉన్నట్లుగా నమోదైనందు వల్ల ఆయా వృద్ధులకు పింఛన్ పొందే అర్హత కోల్పోయారన్నారు. అటువంటి వారికి వయసు నిర్ధారణ పత్రాలు అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఇచ్చే ఏర్పాటు చేయాలని కోరారు.

వయస్సు నిర్ధారణ పత్రాలు జిల్లాలో 3300 మందికి పైగా ఇవ్వ వలిసి ఉందని సంబంధిత జాబితాతో కూడిన లేఖను విజయనగరం ప్రభుత్వ జిల్లా జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు లేఖ రాశామని పేర్కొన్నారు. అయినా తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. జిల్లాలోని గ్రంథాలయపు పన్ను వసూలు చేసిన మున్సిపాలిటీలు గ్రామపంచాయతీలు జిల్లా గ్రంథాలయ సంస్థకు కోట్లాది రూపాయలు జమ చేయడం లేదని అందువల్ల బకాయి చెల్లించని సంస్థలపై ఫైన్ వేసి గ్రంథాలయ పన్ను రాబట్టేలా తగు చర్యలు తీసుకోవాలని తదితర సమస్యలపై వినతి అందించారు.

యోగా కార్యక్రమం జయప్రదం చేయండి

- మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి

విశాలాంధ్ర - బొబ్బిలి : మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు బొబ్బిలి పురపాలక సంఘ పరిధిలో యోగాంధ్ర మాసమును మే 21 నుండి జూన్ 21 వరకు నిర్వహిస్తున్నందున మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందికి వార్డ్ ఇన్చార్జ్ ఆఫీసర్లకు మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో సమావేశము ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వం వారు నిర్దేశించిన యు.ఎల్.బి లెవెల్ కమిటీ, వార్డ్ స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి ప్రతి సచివాలయం నందు తొమ్మిది మంది సెక్రటరీలను ట్రైనర్లుగా గుర్తించి వారికి రిజిస్ట్రేషన్ చేసి వారికి మాస్టర్ ట్రైనర్‌గా, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ వాళ్లతో మే 27న శ్రీ పొట్టి శ్రీరాములు మున్సిపల్ హైస్కూల్లో మధ్యాహ్నం రెండు గంటల నుండి నాలుగు గంటల వరకు సెక్షన్ ఇచ్చి తదుపరి ఈ ట్రైనర్లు అందరూ వార్డు సచివాలయ పరిధిలో ప్రతి సెక్రటరీ 50 మందికి శిక్షణ అందించాలని, మే 30లోగా మూడు కేటగిరీలో యోగపై పోటీ నిర్వహించి వాటి స్థాయి నుండి యు.ఎల్.బి స్థాయి జిల్లా స్థాయి మరియు రాష్ట్రస్థాయి పోటీలకు పంపించబడుతుందన్నారు. ప్రతి సెక్రటరీ తమ క్లస్టర్ పరిధిలో పౌరులందరినీ యోగాంధ్ర పోర్టల్ లో రిజిస్ట్రేషన్ చేయించాలని. జూన్ 11న మున్సిపల్ స్థాయి యోగ అభ్యాసం, ర్యాలీ నిర్వహించబడుతుందన్నారు. తర్వాత జూన్ 21 తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రతి సచివాలయ స్థాయిలను యు.యల్. బి స్థాయిలోనూ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యంతో పాదచారికి గాయాలు

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: విజయనగరం జిల్లా, సీతంపేట గత రెండేళ్లుగా ఇనుప ముక్కల వ్యాపారంలో ఉన్న పల్లా సూర్యనారాయణ వంగర (విజయనగరం మండలం) నిన్న రాత్రి 7 గంటల సమయంలో రోడ్డుపై నడుచుకుంటూ ఉండగా, వెనక నుండి వచ్చిన ఆర్టీసీ బస్సు తనను గుద్దినట్లు ఫిర్యాదు. ఘటనలో సూర్యనారాయణ తలకు తీవ్రగాయాలు అయ్యి, అంబులెన్స్ ద్వారా విజయనగరం హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. ఆర్టీసీ బస్సు (విజయనగరం నుండి ఎస్.కోట దిశగా వెళ్తున్నది) డ్రైవర్ అజాగ్రత్తగా, అధిక వేగంతో వాహనాన్ని నడిపించడం ఘటనకు కారణమని ప్రాథమికంగా తెలుస్తోంది. సర్కిల్ ఇన్స్పెక్టర్ వి.యన్. మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా, ఆర్టీసీ డ్రైవర్ల నిర్లక్ష్య ప్రవర్తనపై ప్రశ్నలు ఎదురయ్యాయి. ప్రజల సురక్షితాన్ని నిర్ధారించడానికి డ్రైవర్ల శిక్షణ మరియు వేగ పరిమితుల కట్టుదిట్ట అమలు అవసరమని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

మహానాడుకి తరలి వెళ్లిన పెందుర్తి నియోజకవర్గం టిడిపి శ్రేణులు

విశాలాంధ్ర -సబ్బవరం: ఈ నెల 27,28,29తేదీలలో కడపలో జరగబోయే మహానాడుకి పెందుర్తి నియోజకవర్గం నుండి పెందుర్తి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి,ఏపి ఆయిల్ సీడ్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, విశాఖ జిల్లా పార్లమెంటు అధ్యక్షులు గండి బాబ్జి ఆధ్వర్యంలో పెందుర్తి నియోజకవర్గ కార్యాలయం నుండి మొగలిపురం ఎంపీటీసీ తమరాణ బంగారునాయుడు, బంగారమ్మ పాలెం సర్పంచ్ దాడి కన్నం నాయుడు తెలుగుదేశం జెండా ఊపి మహానాడు బస్సును ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వర్గీయ ఎన్ టి రామారావు ప్రారంభించిన మహానాడు నేటికీ కూడా జరగడం ఆనందదాయకమని పేర్కొన్నారు. నాడు ఎన్టీ రామారావు ప్రారంభించిన మహానాడుని ఆదర్శంగా తీసుకుని నేడు చంద్రబాబు నాయుడు కొనసాగిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.